క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కేపీ



సీఎంతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: శాసనసభ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని అసెంబ్లీ ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు.

కౌలు రైతుల సదస్సు జయప్రదం చేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

దొనకొండ: ఒంగోలు సీపీఐ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన జరిగే కౌలు రైతుల సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షులు దేవండ్ల శ్రీనివాస్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించి కౌలు రైతులతో మాట్లాడారు. అనంతరం కౌలు రైతులకు కరపత్రాలు పంచి పెట్టారు. బ్యాంకుల్లో కౌలు రైతులకు రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతుల సదస్సును జయప్రదం చేయాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట రైతు సంఘ నాయకుడు బాణాల రామయ్య ఉన్నారు.

టీఎంఆర్ పశుదాణా పంపిణీ



పశుదాణా పంపిణీ చేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి

కొనకనమిట్ల: పాడి గేదెలకు అవసరమైన టీఎంఆర్ పశుదాణాను మండలంలోని గొట్లగట్టులో పశువైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. పశుపోషకులకు అవగాహన కల్పించారు. తొలుత పశుదాణా అవసరమైన పశుపోషకులు ఆర్బీకేల్లో నగదు చెల్లించి నమోదు చేసుకున్న వారికి టీఎంఆర్ పశుదాణా పంపిణీ చేశామని రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. టీఎంఆర్ సమీకృత దాణాలో మాంసకృత్తులు అధికంగా ఉండటంతో పశువులకు సమతుల్య ఆహారం అందుతుందన్నారు. పశుగ్రాసానికి సంబంధించి గడ్డి జొన్నలు, అలసందలు రైతులకు అందజేశామన్నారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, పశు వైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణకు మద్దతు తెలపాలి



ర్యాలీకి హాజరైన ఎంఆర్‌పీఎస్ నేతలు

మార్కాపురం టౌన్: రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీల వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి అన్ని పార్టీల నాయకులు మద్దతు తెలపాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింహారావు కోరారు. బుధవారం ఎంఆర్‌పీఎస్ మాదిగల సంగ్రామ పాదయాత్ర మార్కాపురం చేరుకుంది. వర్గీకరణపై బీజేపీ మోసం చేసిందని, ఏప్రిల్ 4న అమరావతి, హైదరాబాద్ బీజేపీ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన స్పష్టం చేశారు. మార్కాపురం సరిహద్దులో యాత్ర వచ్చిన సందర్భంగా సీనియర్ ఎంఆర్‌పీఎస్ నేత పందీటి కాశీరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్వీనర్ ఆదిమూలపు ప్రకాష్, టి.ఆనంద్, దేవదాసు, కోటయ్య, ఏసు, రాజు, కిరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రం వద్ద పోలీసులకు సూచనలిస్తున్న సీఐ భీమానాయక్



కంభంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

మార్కాపురం టౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం మార్కాపురంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని కమలా, రెడ్డి, సాధన, ట్రినిటీ, గౌతమి, ఏపీఆర్‌డబ్ల్యూఎస్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరం హాల్లోకి పంపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. కాపియింగ్ జరగకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాలను సీఐ భీమానాయక్, ఎస్‌ఐ శశికుమార్‌లు సందర్శించి బద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బందికి సూచించారు.

కొమరోలు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు నిర్వహించగా 245 మంది విద్యార్థులకు 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ నంద్యాల శ్రీనివాసులు తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లే ముందే పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి అనుమతించారు.

గిద్దలూరు రూరల్: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 4 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. మొత్తం 1290 మంది విద్యార్థులకు 197 మంది గైర్హాజరుకాగా 1093 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చి ఒంగోలు ఆర్‌ఐఓ కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు కస్టోడియన్ అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.



త్రిపురాంతకంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

కంభం: ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 441 మంది, గౌతమి జూనియర్ కళాశాలలో 330, సీఎల్ఆర్ జూనియర్ కళాశాలలో 427, వాసవీ జూనియర్ కళాశాలలో 330, తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 225 మంది విద్యార్థులను కేటాయించారు. పరీక్ష కేంద్రాలను స్థానిక సీఐ రాజేష్‌కుమార్, ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావులు పరిశీలించి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

యర్రగొండపాలెం: ఇంటర్మీడియెట్ పరీక్షలు తొలిరోజు బుధవారం వైపాలెంలోని నాలుగు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గురుకుల జూనియర్ కళాశాలలో 166 మందికిగాను 8 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ రాజేంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 254 మందికిగాను 236 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కె.వి.నారాయణ చెప్పారు. కాగా స్థానిక సాధన, గౌతమి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలకు అరగంట ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులను అనుమతించలేదు.

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 186 మంది విద్యార్థులకుగాను 170 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. త్రిపురాంతకంలోని కేజీబీవీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాల, వైష్ణవి కాలేజీలోని కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.

బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవాలు



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు



శ్రీవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

- నందడి నెలకొన్న వెలుగొండ తిరునాళ్ల
- గరుడ వాహనంపై శ్రీవారి ఉత్సవం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం తిరునాళ్ల కావడంతో వెలుగొండలో భక్తులతో బ్రహ్మోత్సవ సందడి నెలకొంది. క్యూలైన్లో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు పల్లకిలో అలంకరించిన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారిని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలుగా కూనపల్లి శేషఫణిశర్మ, ప్రసాద శర్మ, దూర్జటిశర్మ, వీరభద్రశర్మ, శ్రీకాంతశర్మ, రామచంద్ర పవన్‌కుమార్, శాంతమూర్తి, జానకీరామ్ దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగాయి. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవనకుమార్‌శర్మ స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అన్నీ కులాల అన్నదాన సత్రాల్లో అన్నదానం చేశారు. గురువారం మోహినీ ఉత్సవం, గజోత్సవం, తిరునాళ్ల, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఉడుముల పూజలు

తిరునాళ్లను పురస్కరించుకొని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ గీతికారెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్లు ఉడుముల స్పష్టం చేశారు. ఆలయ వేదపండితులు, ఆలయ ఈఓ, చైర్మన్‌లు నాయకులను ఘనంగా సన్మానించారు. ఉడుములతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రబీ పంటల జాబితాపై అవగాహన



దొనకొండలో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఏఓ



త్రిపురాంతకంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

త్రిపురాంతకం: రబీలో సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియపై రైతులంతా అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి కె.నీరజ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం పాత అన్నసముద్రం ఆర్బీకేలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రబీ పంటల నమోదు జాబితాను చదివి వినిపించారు. రైతులు తమ వివరాలు సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని చందవరం, రుద్రసముద్రం, పోలేపల్లి, మల్లంపేట, వెంకటాపురం గ్రామాల్లోని రైతులకు స్థానిక ఆర్బీకేలో వ్యవసాయాధికారి కె.ప్రకాష్ సమక్షంలో వ్యవసాయ పనిముట్లు బుధవారం పంపిణీ చేశారు. 2020-21లో జాతీయ ఆహార భద్రత పథకం కింద వ్యవసాయ పనిముట్ల కోసం రూ.7 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. 50 శాతం సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు 15, నాగళ్లు 7, ట్రాక్టర్ స్ప్రేయర్లు 2 పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రైతు గ్రూపులకు మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని ఏఓ తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: పంట నమోదు రైతుల జాబితాను ఆర్‌బీకేల వద్ద సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు వ్యవసాయాధికారి జక్కం మెర్సీ తెలిపారు. బుధవారం మండలంలోని పీవీ పురం ఆర్‌బీకేలో రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ నెల 17వ తేదీలోపు రబీ సీజన్ 2022 పంటలు వేసిన రైతులు ఈ-పంట నమోదు జాబితాను సరిచూసుకోవాలని కోరారు. ఏఈఓ, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని గడికోట రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఈ-క్రాప్ బుకింగ్‌పై సామాజిక తనిఖీ, గ్రామ సభ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ-క్రాప్‌కు సంబంధించిన జాబితాను రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామని చెప్పారు. రైతులు తమ పంటలు యథావిధిగా నమోదు చేసారా లేదా చూసుకొని తప్పులు ఉంటే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా సరి చేసుకోవాలని చెప్పారు. ఏఈఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: రబీలో సాగు చేసిన పంటలకు ఈ-పంట నమోదు, ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు వ్యవసాయాధికారి ఎస్‌కే జైనులాబ్దిన్ చెప్పారు. బుధవారం పొదిలి మండలం మల్లవరం ఆర్బీకేలో గ్రామసభ నిర్వహించి పంట నమోదు చేసిన రైతుల వివరాలను చదివి వినిపించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా పంట నమోదు చేసిన వివరాల్లో ఎటువంటి పొరపాట్లు ఉన్నా సరి చేస్తామన్నారు. రైతులు ఆర్బీకేల్లో ప్రదర్శించిన జాబితాను చూసుకుని తప్పులు సవరించుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ రెడ్డెబోయిన సుబ్బయ్యకు పంట నమోదు జాబితా అందజేశారు.

తాళ్లూరు: లాభదాయకమైన పంటల సాగుకు రైతులు సమాయత్తం కావాలని జిల్లా వనరుల కేంద్రం టెక్నికల్ ఏవో శైలజారాణి కోరారు. క్షేత్రియ పర్యటనలో భాగంగా బుధవారం బెల్లంకొండవారి పాలెం, దోసకాయలపాడులో వ్యవసాయాధికారి ప్రసాదరావుతో కలిసి పర్యటించి రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి ఇప్పటికే చేతికి వచ్చిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగు ఖర్చులు పోను దిగుబడి వ్యయాలను లెక్కించుకుని లాభదాయంగా ఉండే పంటల సాగు వైపు రైతులు దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను వివరించారు. నువ్వులు, మొక్కజొన్న, మిరప పంటలను సందర్శించి సంరక్షణ చర్యలు సూచించారు. ఆర్‌బీకేలో రైతులతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేశారు. సర్పంచి పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ జీఎస్ ప్రభాకర్‌రెడ్డి, వీఏఏ భార్గవి పాల్గొన్నారు.

అర్థవీడు (కంభం): రబీకి సంబంధించి పంట నమోదు కార్యక్రమం అన్ని గ్రామాల్లో పూర్తయిందని మండల వ్యవసాయాధికారి మహ్మద్ తెలిపారు. బుధవారం మోహిద్దీన్‌పురం రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ కందుల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పంట నమోదు ముసాయిదా జాబితాపై సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. తుది జాబితాను ఈ నెల 20వ తేదీన విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆ కుంటను పునఃనిర్మించాలి



కుంట స్థలాన్ని పరిశీలిస్తున్న ఉపాధి అధికారులు

కురిచేడు: స్థానిక దర్శి రోడ్డులోని రెండో కిలోమీటర్ వద్ద పూర్వం నుంచి ఉన్న పట్టాభిరామయ్య కుంటను పునః నిర్మించాలని ఆ ప్రాంత రైతులు డ్వామా పీడీ శీనారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారి వినతిని పరిశీలించిన శీనారెడ్డి ఆ ప్రాంతాన్ని వెంటనే పరిశీలించాలని ఏపీఓ నాగప్రసాద్‌ను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం ఏపీఓ నాగప్రసాద్ తన సిబ్బందితో వచ్చి కుంట ప్రాంతాన్ని పరిశీలించారు. గతంలో కూడా ఈ కుంట పూడిక తీత పనులు ఉపాధి హామీ పథకం ద్వారా చేసినట్లు సిబ్బంది గుర్తు చేశారు. కురిచేడు రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 577లో 12 మంది రైతులకు చెందిన 26.89 కరాలు సాగు భూమి ఉంది. ఆ భూమిలో కొంతమేర రైతులకు, పశువులకు తాగునీరు కోసం కుంట తవ్వించారు. గ్రామం ఆవిర్భావం నుంచి దర్శి ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న పట్టాభిరామయ్య కుంటను ఇటీవల కొందరు పూడ్చివేశారు. దాన్ని తిరిగి నిర్మిస్తే పొలం పనులకు వెళ్లే రైతులకు, రైతు కూలీలకు, దర్శి రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులకు తాగునీరు అందించవచ్చు. వేసవిలో పశువులకు కూడా తాగునీరు అందించవచ్చని గ్రామానికి చెందిన మేరువ పెద్దిరెడ్డి ఎన్‌ఆర్ ఈజీఎస్ పీడీ శీనారెడ్డికి విషయాన్ని కూలంకషంగా వివరించారు. దీంతో అక్కడ తిరిగి పనులు ప్రారంభించాలని, అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మండల స్థాయి అధికారులను ఆయన ఆదేశించినట్లు ఏపీఓ నాగప్రసాద్ తెలిపారు. ఉపాధి సిబ్బందితో పాటు రైతులు వెలుతుర్ల ఏడుకొండలురెడ్డి, నుసుం ఎల్లారెడ్డి, ఎన్వీ నాగిరెడ్డి, మేరువ పెద్దిరెడ్డి ఉన్నారు.

ఎనిమిది గ్రామాల్లో రీసర్వే పూర్తి

పొదిలి రూరల్: మండలంలోని ఎనిమిది గ్రామాలల్లో భూ రీసర్వే పూర్తయినట్లు తహసీల్దార్ డి.భాగ్యలక్ష్మి చెప్పారు. ఇప్పటి వరకు తుమ్మగుంట్ల, అక్కచెరువు, అన్నవరం, దొండేరు, మూగచింతల, టి.సల్లూరు, మాదాలవారిపాలెం, రామాయనకండ్రిక గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం నిమ్మవరం, రాములవీడు గ్రామాల్లో రీసర్వే జరుగుతోందన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో చేస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలు మినహా ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేవని ఆమె పేర్కొన్నారు

మార్కెట్ కోసం స్థలాల పరిశీలన



స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

దర్శి: పట్టణంలోని చిరువ్యాపారులు వ్యాపారం చేసుకునేందుకు మార్కెట్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పట్టణంలో పలు స్థలాలను బుధవారం పరిశీలించారు. పొదిలి రోడ్డు పిల్ల కాలువపై నుంచి భాష్యం స్కూల్ వరకు, కురిచేడు రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేణుగోపాల్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు నగర పంచాయతీ కమిషనర్ మహేష్‌తో కలిసి చర్చించేందుకు స్థల పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో చిరు వ్యాపారులు రోడ్లపై వ్యాపారాలు చేసే వారి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వారికి ఒక ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేస్తే వినియోగదారులకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందని మంచి ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా అందరితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి పేర్కొన్నారు. మద్దిశెట్టి శ్రీధర్, ఎంపీపీ సుధాఅచ్చయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, కౌన్సిలర్ వీసీ రెడ్డి, తాళ్లూరు ఎంపీపీ, జెడ్పీటీసీలు శ్రీనివాసరావు, మారం వెంకారెడ్డి పాల్గొన్నారు.

రేపు జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎమర్జ్-2023



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కళాశాల సిబ్బంది

మార్కాపురం: స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 17,18 తేదీల్లో జాతీయ స్థాయి ఎమర్జ్-2023ను నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ తెలిపారు. బుధవారం కళాశాలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 18న జాతీయ సాంకేతిక కల్చరల్ సదస్సు కూడా నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ పీపీఎస్ నాయక్, ప్రొఫెసర్ ఆది సత్యనారాయణలు కన్వీనర్‌లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ, వివిధ కళాశాలల నుంచి ప్రొఫెసర్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ మస్తానయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తులను స్థానిక పాలటెక్నిక్ కాలేజీ ద్వారా చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష హాజరయ్యే విద్యార్థులకు వచ్చే నెల 16వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపా రు. కందుకూరు పాలిటెక్నిక్ కాలేజీలో సివిల్, ఎలక్ట్రిక ల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లు ఉన్నాయని చెప్పారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

సింగరాయకొండ: స్థానిక బాలయోగినగర్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై బుధవారం ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు విచారణ చేపట్టారు. గుడి స్థలం ఆక్రమించి అక్రమ కట్టడం చేపట్టాడన్న ఆరోపణపై బాలయోగినగర్‌కు చెందిన ఎస్.హర్షారెడ్డి, మరో ఆరుగురు జనవరి 17వ తేదీన తన మీద దాడి చేసి కులం పేరుతో దూషించారని దావులూరి ఆదాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఫిబ్రవరిలో కేసు నమోదైంది. ఈ మేరకు బుధవారం డీఎస్పీ విచారణ చేపట్టారు. ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా ఉన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

పీసీపల్లి: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని పడమటిపల్లిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పొట్టిశ్రీరాములు సేవాసమితి నాయకులు తెలిపారు. నంధ్యాలకు చెందిన శాంతిరామ్ మెడికల్ కాలేజీ, జనరల్ ఆసుపత్రి వారి సహకారంతో శిబిరం నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు అన్నారంగనాయకులు, ఆరవీటి చిరంజీవి గుప్తలు తెలిపారు. వైద్యశిబిరంలో పరీక్షలు చేసి శుక్లాల ఆపరేషన్‌లు, మందులు అందజేస్తామన్నారు.

225 పొగాకు బేళ్లు కొనుగోలు

కనిగిరి రూరల్: స్థానిక వేలం కేంద్రంలో బుధవారం జరిగిన పొగాకు వేలంలో 225 పొగాకు బేళ్లు కొనుగోలు చేసినట్లు వేలం కేంద్ర ఇన్‌చార్జి బి.కోటేశ్వరరావు తెలిపారు. అలవలపాడు క్లస్టర్ పరిధిలో మొత్తం 241 పొగాకు బేళ్లు వేలం కేంద్రానికి రాగా 225 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి 16 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.200, కనిష్ఠ ధర రూ.190 పలికింది. వేలంలో మొత్తం ఏడు కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.